క్లుప్తంగా

సమాజసేవతోనే సంతృప్తి



చిన్నారులకు బ్యాగులు అందజేస్తున్న ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ హైదరాబాద్ సర్కిల్

అనంతగిరి: సమాజసేవతోనే నిజమైన సంతృప్తి ఉంటుందని ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ హైదరాబాద్ సర్కిల్ అధ్యక్షురాలు నుపుర్ ఝీంగ్రన్ తెలిపారు. ఈ మేరకు ముందుగా అనంతగిరి గుట్ట ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని భక్తుల కోసం వాటర్ కూలర్ అందజేశారు. అనంతరం వికారాబాద్ పట్టణం రాజీవ్‌గృహకల్పలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు స్టేషనరి అందజేసి చిన్నారులు, వారి తల్లిదండ్రులతో ముచ్చటించారు.

శివదీక్ష ఎంతో పవిత్రమైంది



శివ భక్తులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఆశవర్కర్లు

దోమ: శివ మాలధారణ ఎంతో పవిత్రమైందని ఆశవర్కర్లు ఫర్హాన, అతియా అన్నారు. గురువారం మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామంలో శివ భక్తులకు పండ్లను పంపిణీ చేసి మాట్లాడారు. కుల, మత బేధాలు లేని వారికి దైవభక్తి ఎంతో స్ఫూర్తినిస్తుందని చెప్పారు. మాలధారులు ఉపవాసాలతో కఠోర దీక్షలు చేస్తూ.. శివుడి నామస్మరణతో 41 రోజుల పాటు పూజలు చేయడం ఎంతో భక్తితో కూడుకున్నదని తెలిపారు. ప్రతిఒక్కరు దైవ భక్తిని అలవర్చుకోవాలని, అప్పుడే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు.

నీటి వృథాను అరికట్టాలి



పగిలిన పైప్‌లైన్ నుంచి లీకవుతున్న నీరు

ధారూరు: మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. ధారూరు కమాన్ వద్ద భగీరథ పైప్‌లైన్ పగిలి నీరు లీకవుతున్నా.. చూస్తూ వెళ్తున్నారే తప్ప.. ఎవరూ స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పైప్‌లైన్‌కు మరమ్మతు చేసి లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

బొంరాస్‌పేట: ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో మండల విద్యావనరుల కేంద్రం ఎదుట క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో టీపీయూఎస్ ఎల్లప్పుడూ ముందుంటుదని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి పాపిరెడ్డి, తపస్ మండల శాఖ అధ్యక్షుడు బాకారం చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడు శ్రీప్రియ, ఉపాధ్యక్షుడు వెంకటేశం, సభ్యులు శంకరప్ప, ఈశ్వర్, శశివర్ధ, నిరీక్షణ, కరుణాకర్, లక్ష్మీకాంత్, అనిత పాల్గొన్నారు.

పాదయాత్రగా శివభక్తులు

కొడంగల్ రూరల్: శ్రీశైలం పుణ్యక్షేత్రానికి శివ మాలధారులు పాదయాత్రగా తరలివెళ్లారు. గురువారం మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలోని శివాలయంలో శివస్వాములు శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పురోహితులతో ఇరుముడి కట్టుకొని మల్లికార్జునుడి చెంతకు పాదయాత్రగా వెళ్లారు.

కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడిగా వెంకటేశం



నియామకపత్రం అందుకుంటున్న వెంకటేశం

బంట్వారం: కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ బంట్వారం మండల అధ్యక్షుడిగా రొంపల్లికి చెందిన వెంకటేశం నియమితులయ్యారు. గురువారం మద్వాపూర్‌లో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు రాజు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, జెడ్పీటీసీ సంతోష, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రత్నారెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, సంగమేశ్వర్, నర్సింహులు, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

‘మనబడి’కి మహర్దశ

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘మనఊరు–మనబడి’తో సర్కారు బడులకు మహర్దశ సంతరించుకుంది. విద్యాలయాల బలోపేతమే కాకుండా.. గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడమే ధ్యేయంగా నాణ్యమైన విద్యను అందిస్తోంది. అందుకు రూ.కోట్లు వెచ్చించి పాఠశాలలను తీర్చిదిద్ది.. పల్లెప్రజల మన్ననలు పొందుతోంది.

- ‘మనఊరు–మనబడి’తో మారిన పాఠశాలల రూపురేఖలు
- మన్నెగూడ స్కూల్‌కు మౌలిక వసతుల కల్పన
- మండలంలో 17 విద్యాలయాల ఎంపిక



ఆధునీకరించిన మన్నెగూడ పాఠశాల

పూడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనఊరు–మనబడి కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. ప్రైవేటుకు దీటుగా విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన ‘మనబడి’తో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారు. మనఊరు–మనబడి కార్యక్రమం ద్వారా మండల పరిధిలో 17 పాఠశాలలు ఎంపిక చేశారు. రూ.30 లక్షల లోపు నిధులను 11 పాఠశాలలకు కేటాయించారు. దాదాపు పనులు చివరి దశలో ఉన్నాయి. మరో ఆరు పాఠశాలలకు రూ.30 లక్షల పైన ఉండటంతో టెండర్ వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. మండలంలోని పాఠశాలల మౌలిక సదుపాయాలను కల్పించేందుకు సుమారు రూ.5 కోట్ల నిధులు మంజూరు కాగా.. రూ.3.5 కోట్లకు పైగా ఖర్చయింది.

మౌలిక వసతుల ఏర్పాటు

మనఊరు–మనబడి ద్వారా పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను ఆధునికీకరిస్తున్నారు. పాఠశాలలో ప్లాస్టింగ్, విద్యుత్తు కనెక్షన్, ఫ్లోరింగ్‌పై బండలు వేయడం, బాత్‌రూంలో నీటి వసతి ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాలలకు రంగులు వేయడంతో పాటు ఆట వస్తువులు, బెంచీలు, బ్లాక్‌బోర్డులు, ప్రొజెక్టర్‌తో విద్యను అందించేలా చర్యలు తీసుకున్నారు. తలుపులు, కిటికీల మరమ్మతుతో పాటు పాఠశాలలకు ప్రహరీ నిర్మించి, గేటు ఏర్పాటు చేస్తున్నారు.

పాఠశాలల వారీగా.. నిధులు

కడుమూరు ప్రాథమిక పాఠశాలకు రూ.24 లక్షలకు పైగా..., అంగడిచిట్టంపల్లి రూ.12లక్షలు, చన్గోముల్ రూ.10లక్షలు, గొంగుపల్లి రూ.36లక్షలు, కడుమూరు రూ.6లక్షలు, కంకల్ రూ.15లక్షలు, మంచన్‌పల్లి రూ. 7లక్షలు, మన్నెగూడ రూ.7లక్షలు, పూడూరు రూ.28లక్షలు, మన్‌గుర్తి రూ. 6లక్షలు, ఎన్కేపల్లి రూ.7లక్షలు, మేడిపల్లికలాన్ రూ.7లక్షలు, చన్గోముల్ (జడ్పీహెచ్ఎస్) రూ.67లక్షలు, కంకల్ రూ. 60లక్షలు, మంచన్‌పల్లి రూ.76లక్షలు, మన్నెగూడ రూ.43లక్షలు, పూడూరు రూ.43లక్షలకు పైగా నిధులు కేటాయించారు.

అభినందనీయం



మనఊరు–మనబడి కార్యక్రమం ద్వారా పాఠశాలను ఆధునీకరించడం అభినందనీయం. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు నిధులు కేటాయించి పాఠశాలలను బలోపేతం చేయడం సంతోషకరం. వసతులు కల్పిస్తే విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్యను అందించే వీలుంటుంది. పాఠశాల అభివృద్ధికి నాయకులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు చేయూతనందించాలి.

– సుజాత, హెచ్ఎం, మన్నెగూడ పాఠశాల

బాధ్యత పెంచింది



పాఠశాలలను బలోపేతం చేసి, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా ప్రభుత్వం మనఊరు–మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ తోడ్పాటుతో తరగతి గదులను తీర్చిదిద్దడంతో పాటు, మౌలిక వసతులు కల్పిస్తున్నాం. తరగతి గదుల్లో ప్రొజెక్టర్లతో విద్యను అందిస్తున్నాం. ఆగ్లమాధ్యమంలో బోధన సాగించేలా చర్యలు తీసుకుంటున్నాం. బడుల ఆధునికరణతో మా బాధ్యత పెరిగింది.

–హరిశ్చందర్, ఎంఈఓ పూడూరు

దేశాన్ని దోచేస్తున్న ప్రభుత్వాలు



జోడో యాత్రలో డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, పార్టీ శ్రేణులు

- ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ధనాన్ని కొల్లగొడుతున్నాయని డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ‘హాత్‌సే హాత్ జోడో’ ప్రజాచైతన్య యాత్రలో భాగంగా గురువారం మన్నెగూడ నుంచి గండీడ్ వరకు భారీ ర్యాలీ తీసిన ఆ పార్టీ నేతలు.. పట్టణ కేంద్రంలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూల మాలవేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం టీఆర్ఆర్ మాట్లాడుతూ అటు బీజేపీ, ఇటు బీఆర్ఎస్ దేశాన్ని లూటీ చేస్తున్నాయని, ఆ ప్రభుత్వాలను దేశ ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

రైతు సంక్షేమం కోసం..

రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ద్వారా ప్రజల్లో పూర్తిగా చైతన్యం వచ్చిందని టీఆర్ఆర్ చెప్పారు. ఏ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని, మాయమాటలు చెప్పి మోసం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు సంక్షేమం కోసం రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు అసైన్డ్ భూములు ఇచ్చామని, ఆ భూముల క్రయవిక్రయాలు జరిగేలా పూర్తిస్థాయి పట్టాలను అందజేస్తామని స్పష్టం చేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండలాల అధ్యక్షులు పరశురాంరెడ్డి, ఆంజనేయులు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

దొందూ దొందే..

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

బంట్వారం: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ దొందూ దొందేనని, ఆ రెండు పార్టీలను చిత్తుగా ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. హాత్‌సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా ఆయన బంట్వారం మండల పరిధిలోని మద్వాపూర్‌లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రధాని మోడి, సీఎం కేసీఆర్ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కష్టాలన్నీ.. దూరమవుతాయని ప్రజలకు భరోసా కల్పించారు. కేసీఆర్ మాయ మాటలను నమ్మొద్దని, దళితులకు ఇస్తామన్న మూడెకరాల వ్యవసాయ భూమి ఊసే లేదని, మరోసారి మోసం చేసేందుకు సీఎం సిద్ధమవుతున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఓటనే ఆయుధంతో వారిని తరిమికొట్టాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి రఘుపతిరెడ్డి, జెడ్పీటీసీ సంతోష, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

జీటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు

తాండూరు టౌన్: ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం (జీటీఏ) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని మండల వనరుల కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బందెప్ప మాట్లాడుతూ టీచర్ల సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేస్తున్నామని తెలిపారు. విద్యారంగంలో అత్యున్నతమైన మార్పులు తీసుకురావడంలో సంఘం ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. క్యాలెండర్ ఆవిష్కరించిన వారిలో మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్, ఏటీఓ అజ్మత్ అలీ, ఎస్‌టీఓ శ్రీధర్‌రెడ్డి, జిల్లా సలహాదారు శివకుమార్ ఉన్నారు. కార్యక్రమంలో జీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్, కోశాధికారి సుధీర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రాములు, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు ఆరాధన, ఉపాధ్యాయులు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, విద్యుత్ సమస్యలు తీర్చాలి



సర్పంచుకు వినతిపత్రం అందజేస్తున్న హెచ్ఎంలు

బొంరాస్‌పేట: పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలు తీర్చాలని కోరుతూ గురువారం దుద్యాల సర్పంచు ఖాజాకు ప్రధానోపాధ్యాయుడు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్‌లో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నెహ్రూచౌహాన్, చందర్, సీఆర్‌పీ స్థానిక సర్పంచుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్పందించిన సర్పంచు మాట్లాడుతూ పంచాయతీరాజ్‌శాఖ ఏఈతో మాట్లాడి మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీఇచ్చారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరు

- విద్యారంగాన్ని బలపరచిన పీఆర్టీయూ
- ఆవిర్భావ దినోత్సవంలో సంఘం నేతలు



కుల్కచర్ల: పీఆర్టీయూ జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

పరిగి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పీఆర్టీయూ సంఘం ఏర్పడిందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ అన్నారు. గురువారం పీఆర్‌టీయూ 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సంఘం భవనం వద్ద పీఆర్టీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పీఆర్టీయూ అంటేనే ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు అంటేనే పీఆర్టీయూ సంఘం అనే విధంగా ఆవిష్కృతం నాటి నుంచి నేటి వరకు పనిచేస్తుందని తెలిపారు. ఎన్నో సమస్యలను పరిష్కరించిన ఘనత సంఘానికి దక్కిందని, ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే.. విద్యారంగాన్ని బలపరుస్తూ వచ్చిందన్నారు. మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ మాట్లాడుతూ సంఘాలు సమస్యలు పరిష్కారానికి ఎంతో దోహదపడతాయని, ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిశ్చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి, సంఘం మండల అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గోపాల్, బుగ్గయ్య, వెంకటయ్య, ఉస్మాన్ అలీ, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కుల్కచర్ల: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఉపాధ్యాయ సంఘం నిర్విరామంగా కృషి చేస్తుందని పీఆర్టీయూఎస్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి బస్వరాజులు అన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో పీఆర్టీయూ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి కృషిచేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్, నాయకులు మహేశ్వర్ రెడ్డి, సతీష్, నర్సింహులు, తావుర్య, వెంకటయ్య, ప్రవీణ్, నర్సింహారెడ్డి, సుధీర్, శివప్రసాద్, శ్రీనివాస్, శేఖర్, సంతోష్, తిరుపతిరెడ్డి, శంకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వికారాబాద్‌లో విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ మాట్లాడారు. సంఘం ఎల్లవేళలా ఉపాధ్యాయులకు అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహులు, బాబ్యానాయక్, మండలాల బాధ్యులు శ్రీనివాస్, సతీష్, విజయ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పరిగిలో..

అంధత్వ నివారణకు ‘కంటివెలుగు’



దోమ: కంటి పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు



దౌల్తాబాద్: నేత్ర శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ తదితరులు

- ప్రతి ఒక్కరూ కంటిచూపును పరిరక్షించుకోవాలి
- నేత్ర శిబిరం ప్రారంభంలో వక్తలు

దోమ: అంధత్వ నివారణకోసం ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని సర్పంచు కల్పన అన్నారు. గురువారం దోమ మండల పరిధిలోని గంజిపల్లిలో వైద్యులతో కలిసి నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజలు ఎక్కువగా కంటి చూపు సమస్యలతో బాధపడుతుంటారని, దాన్ని దూరం చేసేందుకు సీఎం కేసీఆర్ కంటివెలుగును తెచ్చారని ఆమె తెలిపారు. గ్రామస్తులందరూ కంటి పరీక్షలు చేయించుకొని కళ్లద్దాలు తీసుకోవాలని, అవసరమైన వారు శస్త్రచికిత్స చేయించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నర్సమ్మ, లావణ్య, వెంకటమ్మ, రాజు, ముంగిలిబై, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు శేఖర్, మోహన్‌సింగ్, వెంకట్‌రాములు, ధశరథ్, శ్రీనివాస్, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో నేత్ర శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటివెలుగు కార్యక్రమం పేదలకు వరంలాంటిదని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు సాయిలు, ఉపసర్పంచ్ రమాదేవి, పంచాయతీకార్యదర్శి కిషన్ తదితరులున్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో..

కొడంగల్ రూరల్: కంటి చూపు లోపించిన వారు కంటి పరీక్షలు చేయించుకోవాలని మాజీ ఉపసర్పంచు శివరాజ్‌పాటిల్ దేశ్‌ముఖ్, లయన్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ దాసప్ప సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో లయన్స్‌క్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. నెలనెలా నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని దృష్టి లోపం ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మురహరి వాసిష్ఠ, మిఠాయి రాజు తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



అల్పాహారం అందజేస్తున్న సభ్యులు

తాండూరు టౌన్: ప్రజలందరూ సామాజిక సేవా గుణాన్ని అలవర్చుకోవాలని అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితీ జిల్లా అధ్యక్షుడు బాకారం జైపాల్ రెడ్డి అన్నారు. గురువారం అయ్యప్ప స్వామి ఉత్తర నక్షత్రాన్ని పురస్కరించుకొని పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు, అనాథలకు అల్పాహారం అందజేసి మాట్లాడారు. మానవసేవయే మాధవ సేవ అని, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సగటు మనిషికి ఏదో ఒక రూపంలో సాయం చేసి, వారిలో భగవంతున్ని చూసుకోవాలన్నదే అయ్యప్ప దీక్షా ప్రచార సమితీ ఉద్దేశమన్నారు. భవిష్యత్‌లో ప్రచార సమితీ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సమితీ ప్రతినిధులు రమేష్, బసిరెడ్డి, నరేందర్‌రెడ్డి, ఉదయ్ చారి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా గృహనిర్మాణ శాఖ భవనం



నిరుపయోగంగా ఉన్న భవనం

దౌల్తాబాద్: విద్యుత్ ఉపకేంద్రం వద్ద గృహనిర్మాణ శాఖ భవనం నిరుపయోగంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మండలానికి ఒకటి చొప్పున రూ.5లక్షలతో గృహనిర్మాణ శాఖ అధికారుల కోసం భవనాలను నిర్మించారు. తెలంగాణ ప్రభుత్వం కొలువుదీరాక గృహనిర్మాణ శాఖను రద్దు చేయడంతో ఆ భవనం నిరుపయోగంగా మారింది. భవనాన్ని వ్యవసాయశాఖ అధికారులకు అప్పగిస్తే వారు విధులు నిర్వహించుకునేందుకు అవకాశం ఉందని, అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆలయం వద్ద హైమాస్ట్ లైట్లు

బొంరాస్‌పేట: దుద్యాల మండల పరిధిలోని పోలెపల్లి ఎల్లమ్మ దేవస్థానంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు గురువారం రాత్రి బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. రూ.3 లక్షలతో ఆలయ ప్రాంగణంలో పలుచోట్ల లైట్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ కోస్గి, కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, చాంద్‌పాషా, నరేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.